

# ఇల్లలకగానే...

పి. సత్యవతి

ఇల్లాలు కాకపూర్వం ఓ యువతి. చదువూ సంధ్య తెలివీ చాకచక్యం, సమయస్ఫూర్తీ, హాస్యం, లాస్యం అన్నీ కలిగిన అమ్మాయి.

అమ్మాయి అందం తెలివీ, వాళ్ల నాన్న ఇచ్చిన కట్నం బాగా నచ్చిన ఓ చిన్నవాడు ఆ అమ్మాయి మెడలో మూడుముళ్లూ వేసి, ఓ ఇంటికి ఇల్లాల్ని చేసి, 'ఇదిగో అమ్మడూ ఈ ఇల్లు నీది' అని చెప్పేడు. ఆ ఇల్లాలు వెంటనే పయిట నడుముకి బిగించి, ఇంటిని అందంగా అలికి ముగ్గులు పెట్టింది. ఆ చిన్నవాడు వెంటనే ఆ ఇల్లాల్ని మెచ్చుకుని, "నువ్వు ఇల్లు అలకడంలో నేర్పరివి - ముగ్గులు వెయ్యడంలో అంతకన్నా నేర్పరివి - సెభాష్ కీప్ ఇట్ అప్," అని ఇంగ్లీషులో మెచ్చుకుని భుజం తట్టాడు-

దాంతో ఆ ఇల్లాలు తెగ మురిసిపోయి, ఇల్లలకడమే ధ్యేయంగా తన జీవితాన్ని కొనసాగించింది. ఎల్లప్పుడూ ఇంటిని పరిశుభ్రంగా అలికి రంగురంగుల రంగవల్లికలు తీర్చిదిద్దింది. ఆవిధంగా ఆమె జీవితం మూడు అలుకు గుడ్డలూ- ఆరు ముగ్గుబుట్టలుగా సాగిపోతూ వచ్చింది. కానీ ఒకనాడా ఇల్లాలు ఇల్లలుకుతూ అలుకుతూ, 'నాపేరేమిటి చెప్మా' అనుకుంది. అలా అనుకుని ఉలిక్కిపడింది. చేతిలో అలుకు గుడ్డా, ముగ్గు బుట్టా అక్కడ పడేసి కిటికీ దగ్గర నిలబడి తల గోక్కుంటూ, 'నా పేరేమిటి - నా పేరేమిటీ!' అవి తెగ ఆలోచించింది. ఎదురుగా ఇంటికి నేమ్‌బోర్డ్ వ్రేలాడుతోంది. మిసెస్ ఎం. సుహాసిని ఎం.ఏ., పిహెచ్.డి- ప్రిన్స్‌పాల్ 'ఎక్స్' కాలేజి అని- అవును అలాగే తనకీ ఓ పేరుండాలి కదా- ఇలా మర్చిపోయానేమిటి? ఇల్లలికే సంబరంలో పేరు మరిచిపోయాను- ఇప్పుడెలాగ అనుకుని ఆ ఇల్లాలు కంగారు పడిపోయింది. మనసంతా చికాగ్గా అయిపోయింది. ఎలాగో ఆపూటకి ఇల్లలకడం కానిచ్చింది. అంతలో పనిమనిషి వచ్చింది- పోనీ ఆమెకైనా గుర్తుందేమోనని, "అమ్మాయ్ నాపేరు నీకు తెలుసా!" అని అడిగింది.

"అదేమిటమ్మా అమ్మగార్ల పేర్లతో మాకేమిటి పని! మీరంటే మాకు అమ్మగారే- ఫలానా తెల్లమేడ క్రింద భాగంలో అమ్మగారంటే మీరు," అన్నది ఆ అమ్మాయి.

'అవున్లే పాపం నీకేం తెలుసు,' అనుకుంది ఇల్లాలు.

స్కూల్ నించి మధ్యాహ్నం భోజనానికి వచ్చారు- పిల్లలకైనా గుర్తుందేమో నాపేరు - అనుకుంది ఇల్లాలు.

"ఓరే పిల్లలూ నాపేరు మీకు తెలుసా?" అని అడిగింది.

వాళ్లు తెగ ఆశ్చర్యపడిపోయి,

"నువ్వు అమ్మవి. నీ పేరు అమ్మే- మేం పుట్టినప్పటినించీ మాకు తెలిసింది అదే. నాన్నగారి పేరుతో ఉత్తరాలొస్తాయి. ఆయన్నంతా పేరుతో పిలుస్తారు గనుక మాకు తెలుసు. నీ పేరు నువ్వు నాకెప్పుడు చెప్పలేదుగదా. పోనీ నీ పేరుతో ఉత్తరాలు కూడా రావు," అనేశారు వాళ్లు. అవును తనకెవరు ఉత్తరాలు రాస్తారు? అమ్మానాన్న ఉన్నారుగానీ నెలకో రెండు నెలలకో ఓసారి ఫోన్ చేస్తారు. చెల్లెళ్లు అక్కలూ కూడా వాళ్లవాళ్ల ఇళ్లు అలుక్కోడంలో నిమగ్నమై ఉన్నారు. వాళ్లు ఏ పెళ్లిలోనో పేరంటంలోనో కలిస్తే కొత్తముగ్గుల్ని గురించో- వంటల్ని గురించో మాట్లాడుకోడమేగానీ ఉత్తరాలు లేవు- ఇల్లాలు నిరాశపడిందిగాని ఆమెకి అశాంతి ఎక్కువైంది. తన పేరెలాగైనా గుర్తు తెచ్చుకోవాలనే తపన ఎక్కు

వైంది. అంతలో పక్కింటావిడ పేరంటం పిలవడానికొచ్చింది. పోనీ ఆవిడకేమైనా గుర్తుందేమోనని అడిగితే ఆవిడ కిసుక్కున నవ్వేసి.

"మరే మీ పేరు నేనడగాలేదు- మీరు చెప్పాలేదు. కుడిచేతి వైపు తెల్లమేడావిడ అల్లదుగో ఆ మందుల కంపెనీ మేనేజరుగారి భార్య అనో లేకపోతే తెల్లగా పొడుగ్గా ఉంటుందే ఆవిడ అనో చెప్పుకుంటాం- అంతే," అనేసింది ఆ ఇల్లాలు.

ఇంక లాభంలేదు- పిల్లల స్నేహితులు మాత్రం ఏం చెప్తారు- వాళ్లకి కమలావాళ్ల అమ్మ అనో, అంటీ అనో తెలుసు- ఇక భర్తగారొక్కరే శరణ్యం- ఆయనకే గుర్తుంటే ఉండాలి.

రాత్రి భోజనాల దగ్గర అడిగింది, "ఏవండీ నా పేరు మర్చిపోయానండీ. మీకు గుర్తుంటే చెప్పరా!"

భర్తగారు పెద్దగా నవ్వేసి. "అదేమిటోయ్ ఎన్నడూ లేనిదివ్వాళ్ల పేరు సంగతి ప్రస్తావిస్తున్నావు. నిన్ను పెళ్లయిన్నాటి నుంచీ 'ఏమోయ్' అని పిలవడం అలవాటైపోయింది. నువ్వు కూడా అలా పిలవకండి నా పేరు నాకుంది కదా అని చెప్పలేదు. అందుకని నేనూ మర్చిపోయాను. ఇప్పుడేం- నిన్నందరూ మిసెస్ మూర్తి అంటారుగదా," అన్నాడు.

"మిసెస్ మూర్తి కాదండీ నా అసలు పేరు నాక్కావాలి. ఎలాగిప్పుడు?" అన్నది ఆవేదనగా.

"దానికేం పోనీ ఏదో ఒక పేరు పెట్టేసుకో కొత్తది," అని సలహా ఇచ్చాడు ఆయన.

"బావుందండీ. మీ పేరు సత్యనారాయణమూర్తి అయితే మిమ్మల్ని శివరావు అనో సుందరరావు అనో పెట్టుకోమంటే ఊరుకుంటారా? నాపేరే నాక్కావాలి," అన్నది -

"బాగానే ఉంది చదువుకున్నావుగదా- సర్టిఫికెట్ల మీద పేరుంటుంది గదా! ఆ మాత్రం కామన్‌సెన్స్ లేకపోతే ఎలా? చూసుకో వెళ్లి," అని సలహా ఇచ్చాడాయన మళ్లీ.

ఇల్లాలు సర్టిఫికెట్ల కోసం హోరాహోరీ వెతికింది. బీరువాలో పట్టుచీరెలు, షిఫాన్ చీరెలు, నేత చీరెలు, వాయిల్ చీరెలు వాటి మాచింగ్ జాకెట్లు, లంగాలు, గాజులు, పూసలు, ముత్యాలు, పిన్నులు, కుంకుమ భరిణెలు, గంధం గిన్నెలు, వెండి కంచాలు, బంగారం నగలు అన్నీ పొందికగా అమర్చి ఉన్నాయేగానీ అందులో ఎక్కడా సర్టిఫికెట్ల జాడలేదు. అవును, తను పెళ్లయిన తరువాత ఇక్కడికొచ్చేటప్పుడు అవి తెచ్చుకోలేదు.

"అవునండీ, నేను అవి ఇక్కడికి తెచ్చుకోలేదు. నేను మా ఊరు వెళ్లి సర్టిఫికెట్లు వెతుక్కుని నా పేరు అడిగి తెలుసుకుని రెండు రోజుల్లో వచ్చేస్తాను," అని అడిగింది భర్తని.

"బాగానే ఉంది పేరుకోసం ఊరెళ్లాలా ఏం? నువ్వు ఊరెడితే ఈ రెండు రోజులూ ఇల్లెవరలుకుతారు?"అన్నాడు నాథుడు. అవును నిజమేమరి, తనం దరికన్న బాగా అలుకుతుందని గదా ఆ పని ఎవర్నీ చెయ్యనివ్వలేదు ఇన్నాళ్లూ. ఎవరి పన్లు వాళ్లకున్నాయి. ఆయనకి ఉద్యోగం- పిల్లలకి చదువులు- వాళ్లకెందుకులే శ్రమపాపం అనుకుని తనే ఆ పని చేస్తూ వచ్చింది. వాళ్లకి అసలు చేతకాదు మరి-

అయినా పేరు తెలీకుండా ఎలా బ్రతకడం. ఇన్నాళ్లు ఆ విషయం గుర్తురాలేదు గనుక సరిపోయింది గానీ గుర్తొచ్చాక కష్టంగానే ఉంది.

"రెండురోజులెలాగైనా కష్టపడండి- నేవెళ్లి నా పేరు కనుక్కుని రాకపోతే బ్రతకలేకుండా ఉన్నాను," అని బ్రతిమిలాడి బయటపడింది ఇల్లాలు.

"ఏమ్మా ఇంతర్జంటుగా వచ్చావు? ఆయనా పిల్లలూ బావున్నారా! ఒక్కదానివే వచ్చావేం?" అని అమ్మానాన్నా అప్యాయంగానే పలకరించినా అందులో కొంత సందేహాన్ని కూడా జోడించారు. వచ్చినపని వెంటనే గుర్తుకొచ్చి,

"అమ్మా నా పేరేమిటో చెప్పమ్మా," అనడిగింది ఎంతో దీనంగా ఇల్లాలు.

"అదేమిటమ్మా నువ్వు మాపెద్దమ్మాయివి. నీకు బి.ఏ. దాకా చదువు చెప్పించి యాభైవేలు కట్నం ఇచ్చి పెళ్లిచేశాం- రెండు పురుళ్లు పోశాం- ప్రతి పురిటికీ ఆస్పత్రి ఖర్చులు మేమే భరించాం- నీకిద్దరు పిల్లలు. మీ ఆయనకి మంచి ఉద్యోగం- చాలా మంచివాడు కూడానూ- నీ పిల్లలు బుద్ధిమంతులు."

"నా చరిత్ర కాదమ్మా- నాపేరు కావాలమ్మా నాకు. పోనీ నా సర్టిఫికెట్లు ఎక్కడున్నాయో చెప్పు."

"ఏమోనమ్మా ఈమధ్యన అలమారల్లో పాత కాగితాలు ఫైళ్లు అన్నీ ఖాళీచేసేసి గాజుసామాన్లు సర్దించాం. కొన్ని ముఖ్యమైన ఫైళ్లు అటకమీద పడేశాం. రేపు వెతికిద్దాంలే- ఇప్పుడు వాటికేం తొందర. హాయిగా స్నానం చేసి భోజనం కానియ్యమ్మా," అన్నది ఆ ఇల్లాలి తల్లి. ఇల్లాలు హాయిగా స్నానం చేసి భోజనం చేసింది కానీ నిద్రరాలేదు. ఆడుతూ పాడుతూ ఇల్లలుకుతూ

ముగ్గువేస్తూ పేరు మర్చిపోవడంవల్ల ఇలా ఇన్ని కష్టాలొస్తాయని ఎప్పుడూ అనుకోలేదు.

తెల్లవారింది గానీ అటకమీద ఫైళ్లలో సర్టిఫికెట్లు వెతకడం పూర్తికాలేదు. ఈలోగా ఆ ఇల్లాలు కనపడ్డ మనిషినల్లా అడిగింది- చెట్టునడిగీ- పుట్టనడిగీ- చెరువు నడిగీ- తను చదివిన స్కూలునడిగీ- కాలేజీనడిగీ- అరచీ ఆక్రోశించి ఎట్టకేలకు ఓ మిత్రురాలిని కలిసి తనపేరు సంపాదించింది. ఆ స్నేహితురాలు తనలాగే, తనతోనే చదువుకుని తనలాగే పెళ్లి చేసుకుని, తన లాగా బ్రతుకే ఇల్లలకడంగా కాకుండా, ఇల్లలకడం బ్రతుకులో ఓ భాగంగా బ్రతుకుతూ తన పేరునూ- తన స్నేహితురాళ్ల పేర్లనూ కూడా గుర్తుంచుకున్న వ్యక్తి. ఆ స్నేహితురాలు ఈవిణ్ణి చూడగానే గుర్తుపట్టి, "ఓ హాయ్ శారదా! నా ప్రియమైన శారదా," అని కేకలు పెట్టి కౌగి లించేసుకుంది. అప్పుడా ఇల్లాలికి దాహంతో ఆర్చుకు పోయి, ఎండిపోయి ప్రాణం పోవడానికి సిద్దపడినవాడికి కొత్త కూజాలో నీళ్లు చెంచాతో నోట్లోపోసి బ్రతికించిన చందంగా- బ్రతికించింది ఆ స్నేహితురాలు.

"నువ్వు శారదవి. నువ్వు మన స్కూల్లో టెన్త్‌క్లాసు లో ఫస్ట్ వచ్చావు, కాలేజీలో జరిగిన మ్యూజిక్ పోటీల్లో ఫస్టొచ్చావు. అప్పుడప్పుడు మంచి మంచి బొమ్మలు వేసే దానివి. మనందరం పదిమంది స్నేహితులం. వాళ్లందర్నీ నేను అప్పుడప్పుడూ కలుసుకుంటూనే ఉన్నాను. మేం ఉత్తరాలు రాసుకుంటూనే ఉన్నాం. నువ్వొక్కదానివే మాకు అందకుండా పోయావు! చెప్పు ఎందుకు అజ్ఞాత వాసం చేస్తున్నావు," అని నిలదీసింది ఆవిడ.

"అవును ప్రమీలా- నువ్వు చెప్పింది నిజం. నేను శారదనే- నువ్వు చెప్పేదాకా నాకు జ్ఞాపకం రాలేదు. నా మెదడులోని అరలన్నీ కూడా ఇల్లు ఎంత బాగా అల కాలీ అనే విషయం మీదే కేంద్రీకృతం అయిపోయాయి. ఇంకేం గుర్తులేదు. నువ్వు కనపడకపోతే నాకు పిచ్చెక్కి పోయేది," అంది శారద అనే పేరుగల ఆ ఇల్లాలు. శారద సరాసరి ఇంటికి వచ్చి అటక ఎక్కి పాత ఫైళ్లు తిరగదోడి తన సర్టిఫికెట్లు, తను వేసిన బొమ్మలు, పాత అల్బంలు అన్నీ సాధించింది. తను స్కూల్లో కాలేజీలో గెలుచుకున్న ప్రైజులు కూడా వెతికి పట్టుకుంది.

కొండంత సంతోషంతో ఇంటికి తిరిగివచ్చింది. "నువ్వులేవు- ఇల్లు చూడెలా ఉందో- సత్రంలా ఉంది. అమ్మయ్య నువ్వొచ్చావు ఇంక మాకు పండగేనోయ్," అన్నాడు శారద భర్త.

"ఇల్లలకగానే పండగకాదండీ- అవునుగానీ ఇక నుంచీ నన్ను ఏమోయ్ గీమోయ్ అనకండి నా పేరు శారద. శారదా అని పిలవండి తెలిసిందా," అని కూని రాగాలు తీస్తూ హుషారుగా లోపలికి వెళ్లింది. ఏ మూల దుమ్ము ఉందో ఎక్కడ సామాన్లు ఆర్డర్‌లో లేవోనని చాలా సీరియస్‌గా వెతుకుతూ, డిసిప్లిన్ కోసం తపనపడే శారద రెండురోజులుగా దులపని సోఫాలో హాయిగా చేరబడి, తను తెచ్చిన బొమ్మల్ని పిల్లలకి చూపిస్తూంది.

*ఈ కథ 'ఇల్లలకగానే పండగౌనా?' పేరుతో తొలిసారి అచ్చయ్యింది.*

*ఉదయం వారపత్రిక, 4 మే 1990*

